ప్రజాశక్తి

బుధవారం 19 నవంబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

మావోయిస్టుల కలకలం

ఉలిక్కిపడ్డ జనం



పోలీసు వాహనంలో మావోయిస్టుల తరలింపు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, కంకిపాడు : విజయవాడ సమీపంలోని కానూరు కొత్త ఆటోనగర్‌ను మావోయిస్టులు షెల్టర్‌గా ఏర్పాటు చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా కలిగించింది. ఇక్కడ మావోయిస్టుల కదలికలు కలకలం రేపాయి. నగర శివారు కానూరు కొత్త ఆటోనగర్‌లో పోలీసు బలగాలు సోదాలు చేపట్టి ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన 28 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశారు. ఓ భవనాన్ని షెల్టర్‌గా చేసుకుని మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. ఓ భవనంలో మావోయిస్టులు తలదాచుకున్నారనే సమాచారం అందుకున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్‌ఐబి) భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టగా, ఆరుగురు అనుమానాస్పద రీతిలో పట్టుబడ్డారు. వీళ్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. న్యూ ఆటోనగర్‌లోని ఓ భవనాన్ని షెల్టర్ జోన్‌గా మార్చుకున్నారని నిర్ధారణ అయ్యింది. అక్టోపస్ పోలీసుల సాయంతో భవనాన్ని జాగ్రత్తగా ఖాళీ చేయించారు. ఆపై అందరినీ అదుపులోకి తీసుకుని టాస్క్‌ఫోర్స్ ఆఫీస్‌కు తరలించారు. ఆ తర్వాత పోలీసు వాహనంలోనే వారిని పెనమలూరు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ఆ తర్వాత మరోచోటుకు తరలించారు. భవన యజమాని కోసం ఆరా తీశాయి. భవన యజమాని విదేశాల్లో ఉంటున్నట్లు తెలిసింది. కూలి పనుల కోసం వచ్చామని చెప్పి ఆ భవనాన్ని అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. భవనం వాచ్‌మెన్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామంతో విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఇంటెలిజెన్స్–ఆక్టోపస్ జాయింట్ ఆపరేషన్ కృష్ణాజిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడు

విజయవాడ ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బందాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టినట్లు కృష్ణా జిల్లా ఎస్పి



మావోయిస్టులను పట్టుకున్న ప్రాంతంలో జనం

విద్యాసాగర్ నాయుడు తెలిపారు. కచ్చితమైన సమాచారంతో సోదాలు చేశామన్నారు. విజయవాడతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సోదాలు నిర్వహించామని, మావోయిస్టులకు (మిగతా 2లో)





భవనంలో పోలీసుల గాలింపు; మీడియాతో మాట్లాడుతున్న కృష్ణాజిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడు (పక్కఫొటో)

డ్రగ్స్ వద్దు బ్రో నినాదం మారుమోగాలి

మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయులు



అవగాహనా ప్రదర్శనలో మంత్రి డోలా వీరాంజనేయులు

ప్రజాశక్తి - విజయవాడ : డ్రగ్స్ వద్దు బ్రో నినాదం మారుమోగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. "నశాముక్త భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఆ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దేవయ్య ఆడిటోరియంలో అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి డోలా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. ఇందుకు ఈగిల్ అనే నూతన వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. నార్కోటిక్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టడానికి పోలీస్, ఎక్సైజ్, విద్యా శాఖ, నశాముక్త డి అడిక్షన్ వంటి విభాగాలను సమీకతం చేసి ఈ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. మత్తు పదార్థాలు ఉత్తరాంధ్రలో అధికంగా సాగుచేసే ప్రాంతాలను డ్రోన్స్ ద్వారా గుర్తించి గంజాయి పంటను నిర్వీర్యం చేస్తున్నామన్నారు. గంజాయిని లిక్విడ్, చాక్లెట్ , సిగరెట్ రూపాలలో తరలిస్తున్నారని విద్యాసంస్థల పరిసరాలలో మాదక ద్రవ్యాలను గుర్తించి వాటిని సరఫరా చేసిన వారికీ కఠిన శిక్షలు అమలయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు శాసనసభ సభ్యులు గద్దె రామ్మోహన్ (మిగతా 2లో)

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

ప్రజాశక్తి - విజయవాడ : అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ నిధులు బుధవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.20 వేలు జమవుతాయని ఎన్‌టిఆర్ జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఏర్పాటుతో ఇప్పటికే తొలి విడతగా ఒక్కో రైతు ఖాతాలో రూ.7వేలు జమకాగా, ఈ ఏడాది రెండో విడతగా బుధవారం మరో రూ.7 వేలు జమ అవుతాయని తెలిపారు. దీనిలో భాగంగా అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండో విడతగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున జిల్లాలోని 1,18,629 మంది రైతుల ఖాతాల్లో రూ.59.31 కోట్లు జమకానుండగా, పీఎం కిసాన్ కింద 2వ విడతగా ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున 1,02,015 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.20.40 కోట్లు జమకానున్నాయని, కాగా మొత్తంగా 1,18,629 మంది రైతుల ఖాతాల్లో రూ. 79.72 కోట్లు జమవుతాయని తెలిపారు. జిల్లాలో మైలవరం నియోజకవర్గానికి సంబంధించి ఇబ్రహీంపట్నం మూలపాడులో, విజయవాడ సెంట్రల్‌కు సంబంధించి కే.వి కండ్రిక పిఏసిఎస్‌లో, జగ్గయ్యపేటకు సంబంధించి బండిపాలెం రైతు సేవ కేంద్రంలో, నందిగామకు సంబంధించి నందిగామలో, తిరువూరుకు సంబంధించి గంపలగూడెం ఎంఏఓ కార్యాలయంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో అడుగులు

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. పారిశ్రామిక అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తదితరాలతో పాటు వివిధ పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇటీవల విజయవాడ సెంట్రల్, మైలవరం నియోజకవర్గాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులతోపాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 17 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 6,037 దరఖాస్తులు రాగా 5,949 దరఖాస్తులు పరిష్కారమయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా వివిధ పారిశ్రామిక అభివద్ధి విధానాల కింద 18 క్లెయిమ్‌లకు రూ.1.54 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈసమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీపీవో పి.లావణ్యకుమారి, సాంఘిక సంక్షేమ అధికారి రమాదేవి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు కనకదుర్గ, మురళీకష్ణ, వక్కలగడ్డ భాస్కరరావు, బుచ్చిబాబు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నదిలో పడవ ప్రయాణాలపై నిర్లక్ష్యం !

ప్రజాశక్తి - చందర్లపాడు : కృష్ణానదిలో పడవల ప్రయాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటువంటి ప్రయాణాలపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం తప్ప ముందస్తు చర్యలు తీసుకోవడంలేదని కృష్ణానదీ తీర గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం కృష్ణానదిలో జగ్గయ్యపేట మండలం వేదాద్రి నుండి గింజుపల్లి వెళ్లే పడవకు పెను ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే. నది మధ్య ఇంజన్‌లో లోపం ఏర్పడి పడవ ఆగిపోవడం, ఆ తర్వాత సిబ్బంది, గింజుపల్లి గ్రామస్తులు కలిసి ఆ పడవను తాళ్ల సాయంతో ఒడ్డుకు చేర్చి ప్రయాణీకులను రక్షించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్ల– తాడువాయి పడవ ప్రయాణాలపై కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ పడవకు లైసెన్స్, ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు సరిగా లేవని తెలిసింది. ఇసుక రవాణా చేసే పడవను ప్యాసింజర్ పడవగా మార్పు చేసి ద్విచక్ర వాహనాలతో సహా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. జిల్లా పరిషత్ అధికారులు... ప్రయాణీకులకు మాత్రమే అనుమతి ఇవ్వగా, కృష్ణానదిలో ద్విచక్ర వాహనాలతో సహా



గుడిమెట్ల- తాడువాయి

తాడువాయికి రవాణా చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేసే కన్నా ముందుగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇదే గుడిమెట్ల పడవకు సరైన పత్రాలు లేకపోవడంతో అధికారులు వెంటనే స్పందించి పడవను నిలుపువేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా గుడిమెట్ల– తాడువాయి పడవ ప్రయాణాలపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సిబిఐతో విచారణ

- సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- పట్టుకున్న మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలి

ప్రజాశక్తి - విజయవాడ : హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సిబిఐ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడ సమీపంలోని కానూరులో పట్టుకున్న మావోయిస్టులను తక్షణమే కోర్టులో హాజరుపరచాలని కోరారు. సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం కోసం దళిత, గిరిజన మైనార్టీలపై దాడులను ఖండిస్తూ సిపిఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం విజయవాడలోని అంబేద్కర్ సామాజిక స్మృతివనం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ ప్రాంతంలో జీవిస్తున్న అమాయక గిరిజనులను కాల్చివేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులను ఎటువంటి చర్చలకు పిలవకుండా హోంమంత్రి అమిత్‌షా ఆదేశాలకు మేరకు వారిని నిర్ధాక్ష్యంగా చంపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా సామరస్య వాతావరణంలో చర్చలు జరిపి కగార్ కార్యక్రమాలకు ముగింపు పలకాలని, అమాయక ప్రజలను కాపాడాలని కోరారు. వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న దాడులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును ఆక్షేపించారు. దేశ వ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం దుర్మార్గమని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ మాట్లాడుతూ వివిధ కులాలు, మతాలు, వర్గాలు నివస్తున్న దేశంలో మతం పేరుతో అలజడిలు సష్టించి ప్రత్యేకంగా ఓ వర్గంపై దాడులకు తెగబడటం సిగ్గుచేటన్నారు. డాక్టర్ బిఆర్ అంబ్కేదర్ రచించిన రాజ్యాంగ విలువలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, మహిళా సమాఖ్య నాయకులు పినముత్స దుర్గాభవానీ, పంచదార్ల దుర్గాంభ, విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు, పార్టీ నాయకులు బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ


జవహర్‌కు వినతిపత్రం ఇస్తున్న జల్లి విల్సన్ తదితరులు

ఎస్‌సి కమిషన్ చైర్మన్‌కు దళిత నేతల విజ్ఞప్తి

విజయవాడ : ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ మండలం పోతురెడ్డిపల్లిలో దళిత క్రైస్తవుల శ్మశాన భూమికి దహదారి సౌకర్యంలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్‌కు మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు. మృతదేహాలను తీసుకెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కె.ఎస్.జవహర్‌ను జల్లి విల్సన్‌తోపాటు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఎపి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్‌కు ప్రారంభోత్సవం



విజయవాడ : గాంధీనగర్‌లోని కందుకూరి కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ పాష్టర్స్ ఫెలోషిప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 1000 మందికి పైగా పాష్టర్లు సమావేశమై క్రైస్తవ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎపి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్, ప్రెసిడెంట్ బిషప్ జయ ప్రకాష్ గంజికుంట అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రాజమండ్రి నుండి దహించు అగ్ని మినిస్ట్రీస్ పిండర్ డాక్టర్ ధామస్ మాట్లాడుతూ పాస్టర్ల సంక్షేమం, సంరక్షణకు ఫెలోషిప్‌ను ప్రారంభిచండం హర్షణీయమన్నారు. విశిష్ట అతిథులుగా ఎపియుపియఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ చీఫ్ ఎడ్వజర్ క్రిస్టియన్ ఎఫైర్స్ – రెవ. ఫాదర్ ఇన్నయ్య బెల్లంకొండ, స్టేట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా. శ్రీనివాస్ వడ్లమూడి, ఫెలోషిప్ కమిటీ వైస్ ప్రసిడెంట్ బిషప్ పి.సుందరరావు, బిషప్ పి.నతానియేల్, జనరల్ సెక్రటరి పాస్టర్ ప్రకాష్, సెక్రటరీ రెవ.పి.యెహొూషువ, ట్రెజరరీ రెవ.కె మోజేస్, ముఖ్య సలహాదారు రెవ. డా.పి. మాణిక్యరావు, రెవ. డి దేవ సహాయం బ్రదర్ గాంధీ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో నినాదం మారుమోగాలి

(మొదటి పేజీ తరువాయి)

రావు, ఈగల్ ఎస్పి కేఎస్ నగేష్, డిసేబుల్డ్ అండ్ నశాముక్త భారత్ అభియాన్ డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి, నశాముక్త భారత్ స్టేట్ లెవెల్ కోఆర్డినేటర్ ఉమా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటి, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో మంత్రి ఆకస్మిక తనిఖీ

విజయవాడలో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఐఐటీ, నీట్ లో తటిలో అవకాశం కోల్పోయిన డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు ఐఐటీ నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి స్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. స్టడీ సర్కిల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్న అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాల విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్లను 3 నుంచి 10కి పెంచామన్నారు. విజయవాడ కబేలా సెంటర్‌లో రూ. 80 లక్షలతో శాశ్వత ఐఐటీ నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ సెంటర్ నిర్మిస్తున్నామని చెప్పారు.

మావోయిస్టుల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి 5 జిల్లాల్లో ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు.

ఎవరు ఇప్పించారు ? ఎవరి ద్వారా చెప్పించారు?

మావోయిస్టులకు భవనాన్ని అద్దెకు ఇచ్చిన వారిపై పోలీసులు దృష్టి సారించారు. అసలు ఆ ఇంటి యజమాని.. మావోయిస్టులకు ఇంటిని ఎలా అద్దెకు ఇచ్చాడనే దానిపై ఆరా తీస్తున్నారు. అతనికి మావోయిస్టులతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఎవరు చెబితే ఇచ్చారు.. ఎవరి ద్వారా చెప్పించారు అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. మరోవైపు ఇటీవల కృష్ణాజిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డి, కంకిపాడు మండలాలకు చెందిన మరో ఇద్దరు మావోయిస్టులు డిజిపి వద్ద లొంగిపోయారు. చిన్నాపురానికి చెందిన ఒక వ్యక్తిని మావోయిస్టుగా గుర్తించి హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. గూడూరు మండలం ఐదుగుళ్లపల్లెకు చెందిన ఓ మావోయిస్టు కొద్దినెలల క్రితం వేరే రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు.

చుక్కల భూములపై నిషేధం ఎత్తివేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు

ప్రజాశక్తి-ఉయ్యూరు: చుక్కల భూములపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఉయ్యూరులోని నాగళ్ల రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం కృజిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల చేసిన భూమి సర్వే నేపథ్యంలో అనుమానం వచ్చిన ప్రతి భూమిని చుక్కల భూములుగా పరిగణించి వాటి అమ్మకాలు, కొనుగోలు, రిజిస్ట్రేషన్‌లను నిషేధించిందని, దీని వల్ల వేలాది మంది సెంటు భూమి ఉన్న వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ, అభివృద్ధి పేరుతో వేలాది ఎకరాల వ్యవసాయ భూములను వ్యవసాయ కార్మికులు, దళితుల నుండి లాక్కొని పెట్టుబడిదారులకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. దానిలో భాగంగానే అసైన్డ్ భూములు, చుక్కల భూములు, గ్రామకంఠాలు, చెరువు పోరంబోకు భూములను సాగు చేసుకుంటున్న వారి పేర్లను ఆన్లైన్లో చూపించడం లేదన్నారు. ఒక పక్క వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగి పని దినాలు తగ్గిపోతుంటే మరోపక్క ప్రభుత్వం పంచిన భూములను సైతం పారిశ్రామికరణ పేరుతో వ్యవసాయ కార్మికుల నుండి రాకపోవడం దుర్మార్గమన్నారు. దీని వల్ల సెంటు, కుంట భూములు ఉన్న వ్యవసాయ కార్మికులు వీధిన పడే ప్రమాదం ఉందన్నారు. అసైన్డ్ చట్టాన్ని సవరించి దళితులు, వ్యవసాయ కార్మికుల భూములను కార్పొరేట్లకు అప్పనంగా 99 సంవత్సరాలకు లీజు, 99 పైసలకు అప్పగించే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పవన్‌కుమార్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు రాంబాబు, ఏసోబు, డేవిడ్ రాజు, వెంకటేశ్వరరావు, నాగరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రజాశక్తి-మోపిదేవి: విద్యను అభ్యసించడం ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని ఎంపీపీ రావి దుర్గావాణి చెప్పారు. వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను మంగళవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లంకె సుభాషిణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శీలం సాయి శ్రీ, శీలం హేమాశ్రీలకు గ్రామ కమిటీ సభ్యులు గొరిపర్తి కోటేశ్వరరావు, కందుల సీతారామయ్య, నాగరం సూర్యప్రసాద్ ప్రోత్సాహంతో సర్పంచ్ తుమ్మ సోములమ్మ, ఎంపీపీ రావి దుర్గావాణి, టిడిపి సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు ప్రోత్సాహకాన్ని అందించారు.

పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు వైద్య సేవలు అందించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. మండలంలోని కవుతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే రాము మంగళవారం పరిశీలించారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ పరిశీలించిన ఎమ్మెల్యే ల్యాబ్, ఫార్మసీ, ఇతర విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల వివరాలను వైద్యులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరు జగన్మోహనరావు, మల్లిపెద్ది సుబ్రమణ్యం, నాంజి బాబు, డాక్టర్ బి శ్రావ్య, డాక్టర్ దుర్గ మాధవి, సూపర్వైజర్లు పిహెచ్ఓ ప్రకాశ్, ఉలుసు ఉమా, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సుందర మచిలీపట్నమే లక్ష్యం : మంత్రి కొల్లు



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): దశాబ్దాల చరిత్ర కలిగిన మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో వెనుకబడకుండా చూస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం మచిలీపట్నంలోని పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. 48వ డివిజన్లో డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 35వ డివిజన్ రాజుపేట కొత్త మసీదు సెంటర్లో మూడు కల్వర్టులు, రెండు డ్రైన్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. 48వ డివిజన్ నిజాం పేట రంగా విగ్రహం పక్క రోడ్డులో కల్వర్టు మరియు హెచ్‌డిఇ పి పైపులైన్ పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బందరులో ప్రస్తుతం 95 శాతం వరకు సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు. మున్సిపాలిటీల్లో డ్రైనేజీల నిర్మాణానికి రూ.60 కోట్ల ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జి పల్లపాటి సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నాయకులు వాసు, భాగ్యరాజు, మద్ది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జనగణనతో పాటు కులగణన చేయాలి



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సామాజిక న్యాయం ఆత్మగౌరవం కోసం జనగణనతో కుల గణన చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి ఒడుగు చైతన్య కుమార్ మాట్లాడుతూ జన గణనతో పాటు కులగణన చేయాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆ తర్వాతే స్థానిక సమస్యల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి యర్రంశెట్టి ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మోదుమూడి రామారావు, నారాయణరావు, రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

చల్లపల్లి: జన గణనలతో పాటు కుల గణన సైతం నిర్వహించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చల్లపల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ శ్రీలతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నక్క శ్రీను, వేణు, పి.రాజారత్నం అల్లూరి బాబురావు, గోగినేని రత్తయ్య పాల్గొన్నారు.

కుష్టు లక్షణాలుంటే పరీక్షలు : అఖిల

ప్రజాశక్తి-పమిడిముక్కల: కుష్టు వ్యాధి లక్షణాలు కలిగి ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల అన్నారు. వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని లంకపల్లి, కృష్ణాపురం తదితర గ్రామాల్లో సర్వే జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-పామర్రు: రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని పామర్రు మండల పరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్ కుమార్ అన్నారు.మండల పరిధిలోని జుజ్జువరం గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఓవర్లెని రోడ్డును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ 15 ఫైనాన్స్ నిధుల నుండి 14 లక్షల రూపాయలు సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

ప్రజాశక్తి-పమిడిముక్కల

దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తి నుండి 20 గ్రాముల బంగారం, రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు గుడివాడ డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వీరంకిలాకులో ఆయన మాట్లాడుతూ తాడేపల్లికి చెందిన కడియాల శ్రీధర్ దొంగతనాలకు పాల్పడి తాడంకి ఉన్నత పాఠశాల దగ్గర ఉండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ చిట్టిబాబు, ఎస్ఐ శీను పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన లక్ష్మీకాంతం



ప్రజాశక్తి-చల్లపల్లి: స్వచ్ఛ చల్లపల్లిని విశ్రాంత కలెక్టర్ బి.లక్ష్మీకాంతం దంపతులు మంగళవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ హోదాలో గతంలో సహకారం అందించిన గ్రామాన్ని పరిశీలించేందుకు ఆయన చల్లపల్లి వచ్చారు. స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డిఆర్‌కె ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు లక్ష్మీకాంత దంపతులకు స్వాగతం పలికారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వర్మీ కంపోస్ట్ తయారు పరిశీలించారు.

విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు



గుడ్లవల్లేరులో...

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం, స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు మంగళవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, గ్రంథాలయ అధికారి ఎవిడిటి నగేష్ పాల్గొన్నారు. **ఉంగుటూరు:** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని వాటిని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా గన్నవరం గ్రేడ్-1 గ్రంథాలయంలో సాంకేతిక పరిజ్ఞానం-గ్రంథాలయాల ఉపయోగం, సభ్యత్వ కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో కోటేశ్వరరావు మాట్లాడుతూ అమరావతిలో కేంద్ర గ్రంథాలయాన్ని ఐదు ఎకరాల్లో రూ.155 కోట్లతో రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఆకేపాటి కృష్ణమోహన్, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్, డాక్టర్ మన్నం వెంకట్రాయుడు, డాక్టర్ జివి ప్రసాదరావు పాల్గొన్నారు. **గూడూరు:** గూడూరు గ్రంథాలయం లో స్వాతంత్ర్య సమరయోధులపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫణిరాజ్, నూర్ అహ్మద్ బేగ్, గ్రంథాలయ అధికారి నాగరవి పాల్గొన్నారు. **మొవ్వ:** మొవ్వ శాఖ గ్రంథాలయంలో వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వక్తృత్వము పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కృష్ణకుమారి పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** స్థానిక గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు గ్రంథాల అధికారిణి టి.వాణి తెలిపారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వందేమాతరం 150 సంవత్సరాల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. నాగ సూర్య తేజ విజ్ఞాన్ విహార విద్యాసంస్థల ప్రిన్సిపాల్, ప్రముఖ రంగస్థలం నటుడు పుప్పాల వీరాంజనేయులు, యోగా గురువు మానేపల్లి వేణుగోపాలరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు ఎం. నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. **ఉయ్యూరు:** కాటూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో క్రమశిక్షణ, సీనియర్స్ విభాగంలో మీకు నచ్చిన స్వాతంత్ర్య సమరయోధులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



ఉయ్యూరులో...

సహకార రంగం ద్వారానే సాధికారత

ప్రజాశక్తి-చల్లపల్లి: సహకార రంగం ద్వారానే యువత, మహిళలు, బలహీన వర్గాలకు సాధికారత సాధ్యమవుతుందని జిల్లా సహకార అధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పురిటిగడ్డ సొసైటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం విభాగ సహకార అధికారి వివి ఫణికుమార్ ఆత్మ నిర్మల్ భారత సాధకాలుగా సహకార సంఘాల అనే అంశం గురించి సహకార సహకార శాఖ అభివృద్ధి పథకాల గురించి, సహకార్ సే సమృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ విద్యాధికారి భోజరాజు, చల్లపల్లి కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ వై.నాగరాజు కుమారి, అవనిగడ్డ సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ సబ్ రిజిస్టర్ మహమ్మద్ గౌస్, కొడాలి సొసైటీ చైర్ పర్సన్ గుత్తికొండ ప్రసాద్ మాట్లాడారు.



నవజాత శిశువులకు క్లిష్టమైన చికిత్స

- ప్రతిభ చూపిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య బృందం

ప్రజాశక్తి – హెల్త్ యూనివర్సిటీ : సాధారణంగా నవజాత శివశువులు తల్లి గర్భం నుంచి బయటకు వచ్చిన తరవాత కిలో బరువుపైనే ఉంటారు. కానీ.. కిలో కంటే తక్కువ బరువున్న శిశువులను రక్షించడం వైద్యులకు ఒక సవాల్. అలాంటి సవాల్‌ను



అధిగమించడంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య బందం సరికొత్త రికార్డును సష్టించి మూడు వేల మందికిపైగా ప్రీటర్మ్ శిశువులకు ప్రాణం పోసి పూర్తి ఆరోగ్యాన్ని ప్రసాదించారు. ఈ సందర్భంగా కరెన్సీనగర్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ క్లీనికల్ డైరెక్టర్ డాక్టర్ రామప్రసాద్ శిష్టా మాట్లాడుతూ.. రెయిన్‌బో హాస్పిటల్స్ అన్నిటిలో కలిపి ఇప్పటి వరకు 3,100 మందికిపైగా నెలలు నిండకుండానే పుట్టిన ప్రీటర్మ్ బేబీస్‌కి చాలా క్లిష్టమైన ట్రీట్‌మెంట్‌ను విజయవంతంగా అందించామని పేర్కొన్నారు. అతి తక్కువ బరువుతో పాటు అనేక ఆరోగ్య సమస్యలతో పుట్టే ఈ చిన్నారుల కోసం తమ దగ్గర ఉన్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడి వైద్య పరికరాలు, స్పెషలిస్ట్ డాక్టర్లు, నర్సింగ్ టీమ్ సహకారంతో ఇది సాధ్యమైందని చెప్పారు. ప్రముఖ నియోనాటాలజిస్టులు డాక్టర్ వంశీ శివరామరాజు, డాక్టర్ బి.ఎస్.సి.పి. రాజు, డాక్టర్ పి.బ్రజేష్ణ మాట్లాడుతూ ప్రీటర్మ్ బేబీస్‌కి కావాల్సిన క్లిష్టమైన వైద్యాన్ని అడ్వాన్స్‌డ్ ఎన్ఐసీయూ టెక్నాలజీస్‌ని ఉపయోగించి అత్యుత్తమ నియోనాటలజీ సేవలు విజయవాడ రెయిన్‌బో హాస్పిటల్‌లో అందిస్తున్నామని పేర్కొన్నారు. ఫెసిలిటీ డైరెక్టర్ డాక్టర్ వి.ప్రసాద్ మాట్లాడుతూ.. పిల్లలు కోసం పీఐసీయూ, పిడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ, పిడియాట్రిక్ సర్జరీ విభాగాలలో వైద్యులు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రిమిచ్యూర్ డే సెలబ్రేషన్స్ విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు.

నేషనల్ ఐటి పరీక్షలకు జిఎన్‌ఆర్ఎంపి స్కూల్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ఈ నెల 20, 21 తేదీల్లో ముంబైలో జరగనున్న స్మార్ట్ క్లాస్ రూమ్ క్లైమేట్ సస్టైనబులిటీ నెట్వర్క్ కాన్సెప్ట్‌పై నేషనల్ ఐటి స్కిల్ పోటీ పరీక్షలు నిర్వహించనున్నాయి. ఈ



పరీక్షలకు రామరాజ్యనగర్ జిఎన్‌ఆర్ఎంసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సీడ్స్ సంస్థ, సుజనా ఫౌండేషన్ విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. ముంబైకు చెందిన టెక్కీ సంస్థ గ్రోక్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు సీడ్స్ సంస్థ సిబ్బందితో కలిసి భవానిపురంలోని ఎన్డీఏ కార్యాలయానికి విచ్చేశారు. ముంబైలో జరగనున్న నేషనల్ ఐటీ స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని జిఎన్‌ఆర్ కార్పొరేషన్ స్కూల్ హెడ్మాస్టర్ వి రవి కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి నిమ్మల దంపతులు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మంగళవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గను దర్శించుకున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పంచ హారతి సేవలో సేవా టిక్కెట్టు ద్వారా పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ బొర్రా గాంధీ, ఈవో వి.కె. శీనా నాయక్ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఛైర్మన్ బొర్రా గాంధీ, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను బహుకరించారు.

మొబైల్ ఫోన్ల దొంగలు అరెస్టు

రైల్వే డిఎస్‌పి జి రత్నరాజు



ప్రజాశక్తి – విజయవాడ సిటీ : రైళ్లలో సెల్ ఫోన్లు చోరికి పాల్పడే దొంగలను ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు కలిసి చాకచక్యంగా పట్టుకున్నారు. మంగళవారం విజయవాడ రైల్వే ఎస్‌పి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రైల్వే డిఎస్పీ జి రత్నరాజు కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం నుంచి మచిలీపట్నం వెళ్లే రైలులో ప్రయాణం చేస్తున్న వేర్వేరు వ్యక్తుల సెల్ ఫోన్లు దొంగలించినట్లు ఈ నెల 13న గుడివాడ జిఆర్‌పి స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు బృందాలుగా ఏర్పడి గుడివాడ – మచిలీపట్నం రైల్వే స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మొబైల్ ఫోన్ దొంగతనాలపై విచారణ చేపట్టారు. గుడివాడ రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల పరిశీలన ఆధారంగా ఖచ్చితమైన సమాచారం సేకరించి ఈ 18వ తేదీ ఉదయం గుడివాడ గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా తెనాలిలోని చిన్న రావూరు వీధికి చెందిన షేక్ కరీముల్లా ధర్మవరం రైలు బండిలో బెడ్ రోలర్‌గా చేస్తుండగా, అతని స్నేహితుడు అనంతపురానికి చెందిన ఆదోని చిన్నప్పతో కలిసి రైళ్లలో ప్రయాణికుల మొబైల్ ఫోన్లను దొంగిలిస్తున్నట్లు నిర్ధారణ అయింది. ఇద్దరి నుంచి సుమారు లక్షా 35 వేల రూపాయలు విలువ చేసే ఒక ఐఫోన్, రెండు వివో ఫోన్లు లభించాయి. మరోక 23 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. వాటి విలువ సుమారు నాలుగు లక్షల డెబ్బై వేల రూపాయలు. దీంతో సుమారు రూ.6 లక్షల విలువ గల మొత్తం 26 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు మీడియా సమావేశంలో తెలియజేశారు. రైళ్లలో మొబైల్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేయడంలో ఆర్పిఎఫ్ అసిస్టెంట్ స్టేషన్ కమాండర్ పొన్ను స్వామి పర్యవేక్షణలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వి దుర్గారావు, గుడివాడ ఆర్‌పిఎస్ఐ ఎం షరీఫ్, ఆర్‌పిఎఫ్ /సిఐబి కె మధుసూదన్, ఆర్‌పిఎఫ్ ఇన్స్పెక్టర్లు ఫతే అలీబేగ్, పి రామకష్ణ, ఏఎస్ఐ ఎస్‌కె అక్బర్ వారి సిబ్బందితో బందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించారని రైల్వే డిఎస్పి జి రత్నరాజు పేర్కొన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి – విజయవాడ సిటీ : మాజీ ఎంఎల్ఏ నాజర్ వలి జయంతిని పురస్కరించుకొని రాయల్ ఆప్టికల్స్ అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైసిపి విజయవాడ, గుంటూరు పార్లమెంటు ఇంచార్జ్ పోతిన మహేష్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ద్వారా పేదలకు కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కొరగంజి భాస్కర్ రావు, పైడిపాటి మురళి, బంక అప్పారావు, పాణి, మరుపిల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

20న కోటి దీపోత్సవం

ప్రజాశక్తి – ఇబ్రహీంపట్నం: కొండపల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి రోజు నవంబర్ 20 న సాయంత్రం 6 గంటలకు పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు తెలిపారు. కొండపల్లి పురపాలక కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో దసరా ఉత్సవాల స్ఫూర్తితో మరో ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి పురపాలక, నియోజకవర్గంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశం లో వైస్ ఛైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్ చనుమోలు నారాయణ, మహబూబ్ సుభాని, కొత్తపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



ప్రజాశక్తి- నందిగామ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, డిస్కంల ప్రైవేటీకరణ ఆపాలని, చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వర రావు తెలిపారు. మంగళవారం నందిగామ శివారు చందాపురం సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని తెలిపారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలతోపాటు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, జెఎల్ఎం గ్రేడ్–2, స్టోర్ హమాలీలు తదితర అన్ని స్థాయిల ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 చలో విద్యుత్ సౌధకు పిలుపునిచ్చానట్లు తెలిపారు. ఉద్యోగులకు 4 పెండింగ్ డిఎలు వెంటనే విడుదల చేయాలని, వయో పరిమితి పెంచాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పీసట్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీసవేతనం చెల్లించాలని, కారుణ్య నియామకాల్లో నియమించిన వారికి రెగ్యులర్ ఉద్యోగులకిచ్చే వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె గోపాల్, బండి సత్యనారాయణ, రాజేష్, గాంధీ, భాష,కిషోర్, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహనా సదస్సు

విజయవాడ : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ అడపా నాగ మురళి హాజరై మాట్లాడుతూ ధూమ పానం, మద్య పానం వంటి వ్యసనాలకు అలవాటు పడి



భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులందరూ మంచి నడవలికతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాయక్, గ్రంథాలయాధికారునికే రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విజయవాడ : సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రేడ్–2 శాఖా గ్రంథాలయంలో జూనియర్, సీనియర్ విభాగంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయులు బి.వై వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ.. విద్య ఇతరుల పట్ల గౌరవం, జట్టు కృషి, సామాజిక బాధ్యతను ప్రోత్సహిస్తుందని తెలిపారు. హైస్కూల్ ఉపాధ్యాయులు డి.సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ అధికారి కే.వి.ఆర్.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి విద్య చాలా ముఖ్యమైనదని, నైపుణ్యాలు, జ్ఞానాన్ని అందిస్తుందని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి – విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి పలువురు యాత్రికులు విరాళాలు అందజేశారు. మంగళవారం విజయవాడ సత్యనారాయణ పురానికి చెందిన కె రవికుమార్ దంపతులు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన రాలి గణపతిరావు లీలా దంపతులు రూ.1,00,116 లను విరాళంగా బహుకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి ఆశీర్వచన మండపంలో వేద స్వస్తి అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం ప్రసాదాలను బహుకరించారు.



కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం

ప్రజాశక్తి – విజయవాడ సిటీ : చిట్టినగర్లో వేంచేసివున్న శమి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామివార్ల దేవస్థానంలో శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శివకల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని ప్రధానా అర్చకులు రెంటచింతల సాయి శర్మ నిర్వహించారు. రాజాగిరి రాజేష్ (కాశి) భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్కా శ్రీనివాసరావు (అడ్వకేట్), ఉపాధ్యక్ష్యులు మరుపిళ్ల హనుమంతరావు, సహాయకార్యదర్శి శీరం వెంకటరావు, కమిటీసభ్యులు మజ్జి శ్రీనివాసరావు, పోతిన వెంకట ధర్మారావు, కామందుల నరసింహారావు, పిళ్కా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలతో వ్యభిచారం చేయించిన కేసులో నిందితురాలికి జైలు

ప్రజాశక్తి-విజయవాడ : బాలికలతో బలవంతంగా వ్యభిచారం చేయించిన నింధితురాలికి పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.23 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్ట్ జడ్జ్ వేల్పుల భవాని మంగళవారం తీర్పునిచ్చారు. అజిత్ సింగ్ పోలీసు స్టేషన్ పరిధిలోని బాలిక తల్లిదండ్రులకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద అక్కకు పెళ్లి అయింది. చిన్నతనంలోనే తల్లి చనిపోవడంతో ఇద్దరు అక్కా చెల్లెల్లు అమ్మమ్మ వద్ద పెరిగారు. కొద్ది రోజులకు తన అమ్మమ్మ పెంచలేనని చెప్పడంతో ఇద్దరూ కలిసి ఆటోనగర్‌లో ఒక ఇంటిలో ఉంటున్నారు. ఈ క్రమంలో 2016లో అజిత్ సింగ్ నగర్ ఏరియాకు చెందిన షేక్ జమాల్ బీ, ఆమె భర్త కమల్ బాషా బాలికలకు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లారు. ఆ తరువాత వారిని బలవంతంగా వ్యభిచారంలోకి దించారు. ఈ క్రమంలో 2017 అక్టోబర్ 14న వారి నుండి తప్పించుకుని అజిత్ సింగ్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో షేక్ జమాల్ బీ, ఆమె భర్త షేక్ కమల్ బాషాలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నింధితులు బైయిల్‌పై బయటకు వచ్చిన తరువాత కమల్ బాషా 2024 మే 15న తెదీన ఆత్మహత్య చేసుకున్నాడు. విచారణ అనంతరం ప్రధాన నింధితురాలైన షేక్ జమాల్ బీపై నేరం రుజువు కావడంతో మంగళవారం విజయవాడ పొక్సో కోర్టు జడ్జి శిక్షను ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.2.5 లక్షల చొప్పున మొత్తం రూ.ఐదు లక్షలు నష్టపరిహారం వచ్చేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ ఆథారిటీ వారిని ఆదేశించారు.

మళ్లీ వెంటాడుతున్న భయం..!

- దివిసీమ ఉప్పెనకు 48 ఏళ్లు
- శిథిలావస్థలో తుపాను షెల్టర్లు
- కోతకు గురైన కరకట్టలు
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



శిథిలాల కింద ఉన్న మృతదేహాలు, ఊర్లు వదిలి వెళ్లిపోతున్న దివిసీమ ప్రజలు (ఫైల్)

ప్రజాశక్తి-అవనిగడ్డ

దివిసీమ ఉప్పెన.. సరిగ్గా 48 ఏళ్ల క్రితం ఇదే రోజు వచ్చిన జల ప్రళయం వేల మందిని పొట్టనపెట్టుకుంది. కడలి ఉప్పొంగి లంక గ్రామాల్లో కడుపుకోత మిగిల్చింది. ఊళ్లకు ఊళ్లను నామరూపాలు లేకుండా తుడిచిపెట్టింది. ఈ విషాదం నేర్పిన పాఠంతో దివిసీమలో అల్లకల్లోల పరిస్థితులు ఎదురైనప్పుడు బయటపడేందుకు తుపాన్ షెల్టర్లు, కరకట్టలు నిర్మించారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రక్షణ వ్యవస్థలు శిథిలావస్థకు చేరుకోవడంతో కృష్ణాజిల్లాలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

దివిసీమపై పెను ఉప్పెన కరాళ నృత్యం చేసి పది వేల మందికి పైగా ప్రజలను, లక్షలాది పశువులను, పక్షులను జల సమాధి చేసి పదుల సంఖ్యలో గ్రామాలను తుడిచి పెట్టేసిన పెను తుఫాను జ్ఞాపకాలను తలుచుకుంటే నేటికీ దివిసీమ ప్రజల వెన్నులో వణుకు పుడుతుంది. 1977 నవంబర్ 19వ తేదీన పెను తుపాను ఒక్కసారిగా దివిసీమపై విరుచుకుపడింది. ఈ ఉప్పెనలో 14 వేలకు మందికి పైగా మృత్యువాత పడగా ఒక్క దివిసీమలోనే పది వేల మందికి పైగా మరణించారు. రూ.172 కోట్ల ఆస్తులు నీటిలో కొట్టుకుపోయాయి. నాగాయలంక మండలం ఎదురుమొండి వద్ద వాయుగుండం తీరాన్ని దాటగా గంటకు 130 కిలోమీటర్ల నుంచి 160 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు సముద్రపు అలలు ఎనిమిది మీటర్ల ఎత్తున ఎగిసిపడి తీర ప్రాంతంలోని గ్రామాలను ముంచెత్తాయి. దివిసీమతో పాటు గుంటూరు జిల్లా నిజాంపట్నం, రేపల్లెలో ప్రళయం సృష్టించింది. రాత్రికి రాత్రి నిద్రలోనే ప్రజలు శవాలుగా మారిపోయారు. నాగాయలంక మండలంలోని సొర్ల గొంది, నాచుగుంట, సంగమేశ్వరం, ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ, ఏటిమొగ్గ, కమ్మనమోల, దీన దయాలపురం, గుల్లలమోద, నాలి, భావదేవరపల్లి గ్రామాలు, కోడూరు మండలంలోని

చేదు జ్ఞాపకం

పాలకాయ తిప్ప, హంసలదీవి, ఉల్లిపాలెం, బసవన్నపాలెం, గొల్లపాలెం, ఊటగుండం, ఇరాలి గ్రామాలు ఉప్పెన తాకిడికి తుడిచిపెట్టుకుపోయాయి. సముద్రతీర ప్రాంతం నుంచి సుమారు 20 కిలోమీటర్లు సముద్రపు నీరు చొచ్చుకు వచ్చింది. ఈ ఉప్పెన తాకిడికి గుట్టలు చెట్లు పట్టుకొని కొంతమంది ప్రాణాలు కాపాడుకోగా కోడూరు మండలంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో తలదాచుకున్న వారు మాత్రమే బతకగలిగారు.

ఉప్పెన బాధితులకు అండగా సిపిఎం

దివిసీమలో ఇంతటి ఘోరాకలిని చూసిన సిపిఎం చలించిపోయింది. ప్రజలకు తక్షణమే సహాయం చేయాలని సంకల్పంతో ఆనాటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబస్, రాష్ట్ర సిపిఎం కార్యదర్శిగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య, కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్న మాకినేని బసవపున్నయ్య, దివి ప్రాంతానికి చెందిన గుంటూరు బాపనయ్యలతో కలిసి దివిసీమకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పెన బాధితులను రక్షించేందుకు రూ.5 లక్షల చెక్కును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి వెంకటకృష్ణారావుకు జ్యోతిబస్ అందజేశారు. సుందరయ్య, గుంటూరు బాపనయ్య, పిన్నమనేని మురళీకృష్ణ, ఉమామహేశ్వరరావు, వెల్లంకి కష్ణమోహన్, వెలగా లక్ష్మణరావు, తుమ్మల సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రజారక్షక దళాలను ఏర్పాటు చేసి నాగాయలంక, కోడూరు, మచిలీపట్నంలోని శివగంగ ప్రాంతాలలో శిబిరాలు ఏర్పాటు చేసి రెండు నెలల పాటు ఉప్పెన బాధితులకు సేవలు అందించారు. ముఖ్యంగా గ్రామాల్లో మృతదేహాలను తొలగించడం, దహనం చేయడంతో పాటు అనారోగ్యం బారిన పడ్డ ప్రజలకు సేవలందించేందుకు పశ్చిమ బెంగాల్ నుంచి వైద్యులు తరలివచ్చారు. మచిలీపట్నం మండల పరిధిలోని వాడపాలెం గ్రామ శివారు సత్యనారాయణపురంలో కమ్యూనిటీ హాలు కూడా నిర్మించారు. ఒక్కొక్క శిబిరానికి ఒక్కో రాష్ట్ర కమిటీ సభ్యులు నేతృత్వం వహించి వందలాది పార్టీ కార్యకర్తలతో ఉప్పెన బాధితులకు సేవలందించారు. ఉప్పెనకు తుడుచుకుపెట్టుకుపోయిన గ్రామాల పునర్నిర్మాణంలో పాలుపంచుకున్నారు. రాజకీయ పార్టీలే కాకుండా పోలీసు శాఖ, మిలటరీ, సింగరేణి కాలరీ వారు ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు తరలివచ్చి బాధితులకు సేవలందించారు.

ఆనాటి ఉప్పెనలో మృతిచెందిన వారి జ్ఞాపకార్థం అవనిగడ్డలోని పులిగడ్డ కృష్ణానది ఒడ్డున మండలి వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలోఒక పైలాన్ నిర్మించారు. ప్రతి ఏడాది నవంబర్ 19న ఆ పైలాన్ వద్ద దివిసీమ ఉప్పెన మృతులకు నివాళులర్పిస్తారు. ఉప్పెనకు దెబ్బతిన్న అనేక గ్రామాలలో ఆనాడు నిర్మించిన తుపాను షెల్టర్లు నేడు కొన్నిచోట్ల కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. దివిసీమకు ఇప్పటికీ శాశ్వత రక్షణ రక్షణకు చర్యలేమీ తీసుకోలేదు. ఇటీవల కాలంలో వరదలు అధికంగా వస్తుండటంతో పాటు ఎప్పుడు సునామి వస్తుందో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తీర ప్రాంతాల రక్షణ కోసం నిర్మించిన కరకట్ట అనేకచోట్ల కోతకు గురై దెబ్బతింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర ప్రాంత ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకుని శాశ్వత రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని దివిసీమ ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి : రాము



ప్రజాశక్తి-గుడివాడ: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగమంతా ప్రత్యేక చొరవతో పని చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డు టిడిపి కార్యాలయంలోని ప్రజా వేదికలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతనంగా 12 పిహెచ్‌సిలు మంజూరు అయ్యాయన్నారు. వటి నిర్మాణ పనులను త్వరగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. హౌసింగ్ నిర్మాణాలపై ప్రత్యేక దష్టి పెట్టామని, నియోజకవర్గంలో గృహ నిర్మాణాలకు 932 మంది దరఖాస్తు చేసుకోగా 465 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులు ఈనె 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడివోలు బివై విష్ణుప్రసాద్, ఇమ్రాన్, మల్లీశ్వరి, హౌసింగ్ ఈఈ శివప్రసాద్, ఏఈలు పద్మ, సురేంద్ర, సాయిపవన్, నాగేశ్వరరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ పట్టణ, రూరల్, నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, మురళి, సన్యాసిరావు పాల్గొన్నారు.



పొగాకు రహిత సమాజం కోసం ర్యాలీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: పొగాకు రహిత సమాజం కోరుతూ మచిలీపట్నం వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుండి రామానాయుడు పేట వరకు సాగిన ర్యాలీలో యువతకు అవగాహన కల్పించారు. ర్యాలీని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ టిటికె రెడ్డి, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, లీలా ప్రసాద్, ఎస్పిఎం శివయ్య, నర్సింగ్ ప్రిన్సిపాల్ రోజారామని, ఆర్ఎంఓ నిరంజన్ పాల్గొన్నారు.

సత్యశ్రీకి పిహెచ్‌డి ప్రదానం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి బి.సత్యశ్రీ పిహెచ్‌డి పొందారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ప్రొఫెసర్ కె.మాధవి మార్గదర్శకత్వంలో డిజైన్ సింథసిస్ అండ్ ఫార్మాకలాజికల్ ఏవాల్యుయేషన్ ఆఫ్ నావల్ కంపౌండ్స్ యూజింగ్ సబ్ స్టిట్యూడ్ ఎమైనోతమోప్రిన్‌లో తన డాక్టరేట్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసి పిహెచ్‌డి పట్టా పొందినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

'మత్తు'కు యువత దూరంగా ఉండాలి : సిఐ



ప్రజాశక్తి-గుడివాడ: మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో డ్రగ్స్ వాడకం దుష్పరిణాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలని, 15-25 ఏళ్ళలోపు యువత ఎక్కువగా మత్తుకు బానిసలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్పెక్టర్ జయలక్ష్మి, ఆకర్ష ఫౌండేషన్ సైకాలజిస్ట్ జగదీష్, ఎ.స్వేత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్ పాల్గొన్నారు.



దత్తతపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మాతృత్వం ఒక వరమని, అందుకు దత్తత మరో మార్గమని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎడి నసీరునిసా అన్నారు. గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుడ్లవల్లేరు సెక్టార్ పురిటిపాడు అంగన్వాడి కేంద్రం-1 వద్ద తల్లులకు దత్తత కార్యక్రమంపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. పిల్లల దత్తత విషయంలో తీసుకోవాల్సిన నియమ నిబంధనలను వివరించారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-పామర్రు: స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో ఆధార్ సేవలు పునరుద్ధరింపబడ్డాయని పోస్ట్మాస్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, ఆధార్ సవరణలు ప్రతిరోజు 9 గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం 5 గంటల వరకు అందించబడతాయని అన్నారు. పామర్రు, సమీప గ్రామాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

విధుల్లో అలసత్వం వద్దు : వర్ల



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వర్ల

ప్రజాశక్తి-పామర్రు: పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హెచ్చరించారు. స్థానిక వీరాంజనేయ కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ పూడికలు, జంగిల్ క్లియరెన్స్, శానిటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు మార్కెట్ యార్డ్ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పరస సుబ్రహ్మణ్యం, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

రాష్ట్ర డైరెక్టర్ ఫణికుమార్



ప్రజాశక్తి-ఉయ్యూరు

గత వైసిపి పాలనలో నిర్వీర్యం అయిపోయిన బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలను మరలా పునరుద్ధరించి నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలబడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.వి.ఫణి కుమార్‌అన్నారు. మంగళవారం ఉయ్యూరులోని విష్ణాలయంలో ఉయ్యూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చోడవరపు బాపిరాజు అధ్యక్షతన బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో బ్రాహ్మణ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ నాయకత్వంలో పూర్వవైభవం తీసుకువచ్చి నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే చనిపోయిన నిరుపేద బ్రాహ్మణులకు మట్టి ఖర్చులకు పది వేల రూపాయలు అందిస్తామన్నారు. అనంతరం ఫణికుమార్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకరశర్మ, కోశాధికారి, కోదండ రామ శర్మ, బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగ్గురు పంచాయతీ సిబ్బంది సస్పెన్షన్

ప్రజాశక్తి-కంచికచర్ల : మండల కేంద్రమైన కంచికచర్ల గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు సిబ్బందిని జిల్లా పంచాయతి అధికారిణి లావణ్య సస్పెండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగులు, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తా, జూనియర్ అసిస్టెంట్ ఇల్లా సుబ్బారావులను సస్పెండ్ చేస్తూ డిపిఓ లావణ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది బదిలీల్లో భాగంగా జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగులు మీరా ప్రస్తుతం గండ్రాయి పంచాయతిలో పనిచేస్తుండగా, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తా పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీలోనూ, జూనియర్ అసిస్టెంట్ ఇల్లా సుబ్బారావు చిల్లకల్లు గ్రామపంచాయతీలోనూ పనిచేస్తున్నారు. కంచికచర్ల గ్రామ పంచాయతీలో రూ.24.41 లక్షల నిధులు గోల్ మాల్‌పై విజయవాడ డిఎల్ పిఓ ఎన్ఎల్వి రాఘవన్ కంచికచర్ల పంచాయతీ కార్యాలయంలో అక్టోబర్ 17న విచారణ జరిపారు. ప్రజల నుండి వివిధ రకాల పన్నుల రూపంలో వసూలు చేసిన నిధులతో పాటు పంచాయతీకి రాబడిన వివిధరకాల సొమ్ము రూ.24.41 లక్షలు దుర్వినియోగమైనట్లు డిఎల్‌పిఓ నిర్ధారించారు. కంచికచర్ల గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కాలంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ఉద్యోగులపై చర్యలకు డిఎల్పి ఓ రాఘవన్ జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. డిఎల్పిఓ సిఫార్సులు పనిశీలించిన డిపిఓ నిధులు దుర్వినియోగంపై సరైన ఆధారాలు ఉండటంతో ముగ్గురు పంచాయతీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వంట కార్మికులకు రక్షణ కల్పించాలి



ప్రజాశక్తి- నందిగామ : వంట పని కార్మికులకు ప్రభుత్వం రక్షణ కల్పించి ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నందిగామలో మంగళ వారం సీతారామ వంట పని వార్ల సంఘం (సిఐటియు అనుబంధం) కార్తీక వనసమారాధన నిర్వహించారు. వంట పని కార్మికులు ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ వంట పని కార్మికులకు ప్రభుత్వం ప్రమాద భీమా సౌకర్యం, జీవిత భీమా చేయాలని కోరారు. కార్మికులకు కనీస గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కటారపు గోపాల్, సీతారామ వంట పని వార్ల సంఘం అధ్యక్షుడు మౌళేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు గార్ల సుధాకర్, కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, కేటరింగ్ వర్కర్ల యూనియన్ నాయకులు కొంగర తిరుమల దేవి, జిలేబీ శ్రీను, తదితరులు పాల్గొన్నారు. సీనియర్ వంట మే స్త్రీని సన్మానించి సత్కరించారు.

విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు



ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో భారత జాతీయ జెండాను గీయడం, సీనియర్స్ విభాగంలో వారికి నచ్చిన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాన్ని గీయడం పోటీలు నిర్వహించారు. కంచికచర్ల ఎంఈఓ బాలాజీ పోటీలు ప్రారంభించారు. విద్యార్థులు కళల పట్ల ఆశక్తి కలిగి ఉండాలని తెలిపారు. గంథాలయాధికారిణి వి అమరేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్వేశ్వరరావు, కనకారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలోని అన్ని బ్యాంకుల ఉద్యోగులకు, ఖాతాదారులకు డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు, ఇతర సైబర్ నేరాలపై ఎస్ఐ సత్య నారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. ఆయా బ్యాంకులకు వెళ్లి ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు, సైబర్ నేరాలు ఎలా జరుగుతాయో వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటిపి సమాచారం ఇవద్దొన్నారు. పదే పదే ఫోన్ చేస్తుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ



కంచికర్లలో హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్

నందిగామ : ఎన్టిఆర్ జిల్లాలోని పలు మండలాల్లోని పలు గురుకుల పాఠశాలలు, హాస్టళ్లను ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి మంగళవారం అకస్మికంగా తనిఖీలు చేశారు. పాఠశాల పరిసరాలు, వంట గదులు, బియ్యం, కూరగాయల నిల్వలను పరిశీలించారు. విద్యార్థుల భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.నందిగామ నెహ్రూ నగర్‌లో గిరిజన బాలికల గురుకుల పాఠశాల హాస్టల్‌లో తనిఖీలు నిర్వహించారు. హాస్టల్‌లో ప్రభుత్వ మార్గదర్శకాలు, ప్రత్యేకించి గవర్నమెంట్ మెనూను విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. హాస్టల్లో నూనె ప్యాకెట్లు, వంట సరుకులు, మంచినీరు, పలు విషయాలపై తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు.హాస్టల్ తనిఖీల్లో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలు అంగన్వాడీ కేంద్రాలు తనిఖీ చేశారు. **వీరులపాడు :** వీరులపాడు మండలం జుజ్జూరు జిల్లా పరిషత్ పాఠశాల, బీసీ హాస్టల్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో భోజనం, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసి హాస్టల్ వార్డెన్ రామరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సిబ్బందినిని అభినందించారు. **కంచికచర్ల :** రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయప్రతాపరెడ్డి కంచికచర్లలో విస్తృతంగా పర్యటించారు. కంచికచర్లలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సందర్శించి కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ తదితరాలు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆహార నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సర్ఫ్, ఫినాయిల్ తయారీపై శిక్షణ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అల్ట్రాటెక్ సిమెంట్ ఆర్థిక సాయంతో కె.వి.కె గరికపాడు ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా సర్ఫ్, ఫినాయిల్ తయారీపై మండలంలోని బూదవాడ గ్రామంలో మహిళలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రవి కిషోర్ అధ్యక్షతన కృషి విజ్ఞాన కేంద్ర గహ విజ్ఞాన శాస్త్ర విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ పద్మావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు సర్ఫ్ తయారీకి కావాల్సిన వస్తువులు, ప్యాకింగ్, లేబులింగ్ విధానం ప్రదర్శన పూర్వకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అల్ట్రాటెక్ సిమెంట్ మేనేజర్ రాజశేఖర్, బాపట్ల వ్యవసాయ కాలేజీ విద్యార్థుల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - తిరువూరు : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన తిరువూరు మండలం మల్లెల సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన కర్రి పెద్ద బసవయ్య (85) కుటుంబ సభ్యులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా పాలకొల్లుకు కారులో వెళుతున్నాడు. మల్లెల సమీపంలోకి రాగానే ఎదురుగా వెళ్తున్న బస్సును క్రాస్ చేస్తున్న సమయంలో పొలంలో నుండి రోడ్డుపైకి వచ్చిన ట్రాక్టర్‌ను ఢీ కొట్టగా.. అదే సమయంలో వెనుక నుండి మరో కారు ఢీ కొట్టింది. ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న పెద్ద బసవయ్య మృతి చెందగా.. మిగిలిన వారు క్షేమంగా బయటపడ్డారు. వెనక నుండి ఢీకొన్న కారులో ఉన్న నలుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

జోగి కుటుంబ సభ్యులకు పరామర్శ



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులను మంగళవారం వైసిపి రాష్ట్ర బీసీ సంఘ విభాగం నాయకులు మంగళవారం ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బిసిలపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. తప్పుడు కేసులతో బిసిల గొంతు నొక్కాలను కోవడం చంద్రబాబు నాయుడు అవివేకమని తెలిపారు. జోగి రమేష్‌ను అక్రమ కేసులతో జైలు పాలు చేసినంత మాత్రాన ఆయన గొంతుక ఆగదన్నారు. జోగి రమేష్ కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రాచగోళ్ల రమేష్ యాదవ్, మురుగుడు హనుమంతరావు, కవురు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట రమణ, జిల్లా అధ్యక్షులు మార్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్స్ డేకు ఆహ్వానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: డిసెంబర్ 17న జరగనున్న పెన్షనర్స్ డే కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌కు విశ్రాంత ఉద్యోగస్తులు ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా హాజరుకావాలని వారు ప్రత్యేకంగా ఆహ్వానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ వారితో కొద్దిసేపు స్నేహపూర్వకంగా ముచ్చటించారు. విశ్రాంత ఉద్యోగస్తుల సంక్షేమం, పింఛన్ సంబంధిత ఇబ్బందులు, వైద్య సౌకర్యాలు వంటి అంశాలపై విపులంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం యూనియన్ అధ్యక్షులు ధరణికోట వెంకటరమణ, జగ్గయ్యపేట నియోజకవర్గ యూనిటీ ప్రెసిడెంట్ దార వినోద్ బాబు, సెక్రటరీ డి. మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒగా వెంకట్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-వత్సవాయి : మండల విద్యాశాఖ అధికారి-1గా కె వెంకట్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మైల వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో ఎంఈఓగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



ప్రజాశక్తి-వత్సవాయి డాక్టర్ కెఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు వారి ఆధ్వర్యంలో నిమ్మలో పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమం మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ ఎం.రవి కిషోర్ మాట్లాడుతూ నిమ్మ సాగు లాభదాయకంగా ఉంటుందని, రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ కె. లక్ష్మీకళ మాట్లాడుతూ నిమ్మలో ఎక్కువగా నష్టపరిచేది బంక తెగులు ఇంకా గజ్జి తెగులని, వాటి నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి, అలాగే కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు ం స్ట్రెప్టోసైక్లిన్ 1గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని, ఎగిరే పెను అలాగే పెను బంక నివారణకు అసిటామిప్రిడ్ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుతం మిరప మరియు మామిడిలో చేపట్టవలసిన పద్ధతులను వివరించారు. ఉద్యాన అధికారి శ్రీమతి నీలిమ గారు ప్రస్తుతం ఉన్న పథకాలను రైతులకు వివరించారు. తరువాత మిరప తోటలను సందర్శించి నల్ల తామర పురుగు ఉధృతిని తగ్గించటానికి వేప నూనే 10000 పిపిఎం 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

కొనసాగిన గ్రంథాలయ వారోత్సవాలు

జగ్గయ్యపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో మంగళవారమూ కొనసాగాయి. పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో విద్యార్థి, విద్యార్థులకు డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలను జడ్పీహెచ్ గర్ల్స్ హైస్కూల్ పిఈటి షేక్ షబానా ఆధ్వర్యంలో నిర్వహించారు. సాహితీ కార్యక్రమంలో కవి బత్తుల బ్రహ్మయ్య తెలుగు సాహిత్యంలో జాషువా పద్య వైభవం అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి షేక్ మస్తాన్ వలి, సిబ్బంది పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి శాఖా గ్రంథాలయంలో మంగళవారం జూనియర్ (6, 7 తరగతులకు) విభాగంలో ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలు అనే అంశంపై వక్తత్వ పోటీలు నిర్వహించారు. సీనియర్ (8, 9, 10) విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే నష్టాలు అనే అంశంపై పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణీతలుగా యస్.నాగరాజు, యస్. విజయశాంతి, పి.కామేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలోగ్రంథాలయ అధికారి డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం జూని యర్ కళాశాల విద్యార్థులకు నేటి సమాజంలో మాన వత విలువలు అంశంపై వ్యా సరచన పోటీలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థులకు స్వాతంత్రోద్యమ ఘటనలపై ఏకపాత్రాభినయం, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్లకు చదరంగం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి పద్మ తెలిపారు. **గంపలగూడెం:** పెనుగోలను శాఖ గ్రంథాలయంలో విద్యార్థులు స్వాతంత్రోద్యమ వీరుల చిత్రపటాలను ప్రదర్శించారు. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, తిలక్, టంగుటూరి ప్రకాశం తదితరుల పటాలను ప్రదర్శించినట్లు ఇంచార్జ్ తెనాలి వెంకటేశ్వరరావు తెలిపారు. **మైలవరం :** మైలవరం శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు డివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి రమేష్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

ప్రజాశకి-మైలవరం : మైలవరం తిరువూరు రోడ్డులో ఉన్న శ్రీ రేణుకాదేవి, పాండురంగ స్వామి ఆలయాలలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు వెళ్లిన భక్తులు తాళాలు పగలగొట్టి ఉండటం చూసి పోలీసులకు సమాచారం తెలిపారు. రెండు ఆలయాల్లో విలువైన ఆభరణాలు చోరీకి గురవటంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

గృహ నిర్మాణాలు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని తన చాంబర్ నుంచి హౌసింగ్ పీడీ, ఇంజనీరింగ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే మార్చి 31వ తేదీలోపు గృహ నిర్మాణాలను పూర్తి చేస్తేనే లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు జరుగుతాయన్నారు. పిఎంఎవై 1.0 పథకం కింద మిగిలిన ఇళ్లన్నీ ఉగాది నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఈ నేపథ్యంలో జిల్లాలో మిగిలి ఉన్న 31,381 ఇళ్లను పూర్తి చేయాలన్నారు.

ప్రతిఒక్కరు పరిశుభ్రత పాటించాలి

యాంటి మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) వ్యక్తులకు మాత్రమే కాకుండా సమాజానికే పెద్ద ఆరోగ్య సవాలుగా మారిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ హాలులో ఏఎంఆర్ వారోత్సవాల ప్రచార పత్రాలు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

వైద్యుల సూచన మేరకు మాత్రమే మందులు తీసుకోవాలని, హైజీన్, పరిశుభ్రత చర్యలను తప్పకుండా పాటించాలని, అవసరమైనప్పుడు మాత్రమే మందులు వినియోగించాలన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ పి.యుగంధర్ మాట్లాడుతూ ఏఎంఆర్ కారణంగా ఇన్ఫెక్షన్ల చికిత్స కష్టతరం అవడంతో పాటు మరణాల రిస్క్ పెరిగే అవకాశం ఉందన్నారు.

పగడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ

ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణ పగడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు హాలులో ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణపై ఈఆర్వో, ఏఈఆర్వోలకు నిర్వహించిన శిక్షణా తరగతుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్లతో మ్యాపింగ్ చేయాలని, అదేవిధంగా 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2002 సంవత్సరంలో ఉన్న ఓటర్లతో వెరిఫై చేసి సంతాన (ప్రాజెనీ) మ్యాపింగ్ చేయాలని అధికారులకు సూచించారు. వ్యక్తి మరణించినా, ఇతర ప్రాంతాలకు వలసపోయినా, ఓటర్ల వివరాలను పరిశీలించి వారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించే విధంగా బిఎల్వోలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తహసిల్దార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రతి పోలింగ్ బూత్‌కు బిఎల్ఏ ను తప్పనిసరిగా నియమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-మోపిదేవి: మండల పరిధిలోని మెరకనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో మంగళవారం వెంకట్రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు కట్టిన వారికి బాండ్లు పంపిణీ చేశారు. రుణాలు సక్రమంగా చెల్లించిన రైతులకు బోనస్ నగదును రైతులకు అందించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గోకులం షెడ్డును స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ దళారుల చేతిలో మోసపోకుండా సొసైటీల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజులకే ప్రభుత్వం రైతులకు నగదును తమ బ్యాంకు ఖాతాలలో జమ చేస్తుందన్నారు. సొసైటీల ద్వారా ప్రభుత్వం రైతులకు కల్పించే సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సుబ్బారావు, వ్యవసాయ శాఖ మండల అధికారి హెప్సిబా రాణి, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు కర్రా వెంకటేశ్వరరావు, అంబటి లక్ష్మి, పంచాయతీ సర్పంచ్ యర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాలి

విజయవాడ : సమాజాభివృద్ధికి ప్రతిభను ప్రోత్సహించడం అవసరమని, సమాజ అభివృద్ధిలో సాంస్కృతిక కళలు ప్రధాన పాత్ర పోషిస్తాయని విజయవాడ ఫస్ట్ మెట్రోపాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ దేవు నరసింహారావు అన్నారు. కళలు, సాంస్కృతిక, సేవా రంగాల్లో రాణిస్తున్న "అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య" సేవలు హర్షణీయమన్నారు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన "సమాఖ్య" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఒక సంస్థ 25 సంవత్సరాలుగా సేవలందించడం చిన్న విషయం కాదని సంస్థ అధినేత డా. గణగళ్ళ విజయ్ కుమార్ ను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రీజనల్ జాయింట్ డైరెక్టర్



సిహెచ్.వి.ఎస్.ఎన్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ఒడిశా నుంచి వచ్చిన వివిధ రంగాల ప్రముఖులను సత్కరించిన సంస్థ అధినేతల్ని కొనియాడారు. కార్యక్రమంలో కిల్లాడ అమ్మాజీ, ఏడుకొండలు, షర్మిల సంపత్, జగదీశ్వరశర్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ సంగీత విభావరి ఆకట్టుకున్నాయి.

వ్యాసరచనలో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బంటుమిల్లి

కర్తవ్యమే దైవం అనే అంశంపై శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొమ్మారెడ్డి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆంగ్లం, తెలుగు మాధ్యమాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లను, మెమెంటోలను అందజేశారు. అలాగే ఉత్తమ విలువలతో విద్యను అందిస్తున్నందుకు కొమ్మారెడ్డి స్కూల్‌కు కూడా మెమెంటోను అందజేశారు. విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, సెక్రెటరీ, కరెస్పాండెంట్ శోభ కొమ్మారెడ్డి, ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య, డైరెక్టర్ కొమ్మారెడ్డి హరణి అభినందించారు.



పర్యావరణ పరిరక్షణపై శిక్షణ



ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం థీమ్-5 క్లీన్&గ్రీన్ విలేజ్‌లో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించడం పచ్చదనాన్ని పెంపొందించడంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులు గద్దే పుష్పరాణి, మండల పరిషత్ అభివద్ధి అధికారి బివై విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ సంస్థలలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. **పామర్రు:** క్లీన్ అండ్ గ్రీన్ అంశంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. స్థానికంగా ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సభ్యులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా ఎండిఓ కె.జ్యోతి, డిప్యూటీ ఎండిఓ జనార్ధన్ రావు, పాలన అధికారి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు. **మొవ్వ:** పరిశుభ్రమైన, పచ్చని గ్రామం తీర్చిదిద్దుకోవటానికి ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో దయాల సుహాసిని పిలుపునిచ్చారు. మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ పై సర్పంచులకు, ఉపసర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో త్రినాథ్, విశ్రాంత డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ కే పరమాత్మ పాల్గొన్నారు. **ఉయ్యూరు:** పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన గ్రామాల స్థాపన లక్ష్యంగా పనిచేయాలని మండల పరిషత్ పరిషత్ అభివృద్ధి అధికారి జివిస్వీ శేషగిరిరావు కోరారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ కార్యదర్శులకు, సర్పంచులకు, ఉప సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొండ ప్రవీణ్, టిడిపి మండల అధ్యక్షులు వెనిగళ్ల వెంకట కుటుంబరావు పాల్గొన్నారు.



అలరించిన సైన్స్ మ్యాజిక్ షో

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ బుక్ వెస్ట్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా జన విజ్ఞాన వేదిక(జెవివి) ఆధ్వర్యంలో సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. జెవివి బాల బయ్యన్న మ్యాజిక్ షో చేస్తూ విద్యార్థుల చేత చేయించారు. మ్యాజిక్ వెనకాల ఉన్న లాజిక్కులను పిల్లలకు వివరించారు. మూఢనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశాన్ని పరిశీనాత్మకంగా గమనిస్తూ ప్రశ్నించాలని తెలియజేశారు. శ్రీ శ్రీ ప్రింటర్స్ అధినేత, గ్రంథాలయ వారోత్సవాల కన్వీనర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పుస్తకాల మధ్యన పెరిగిన తాను పుస్తకాల నుంచే జ్ఞానాన్ని సంపాదించానని, ప్రతి పుస్తకం ఒక జీవితాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. రచయిత అనిల్ డానీ మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞానంతోపాటు మనలోని ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బి రవి సమన్వయం చేయగా, సివిఆర్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): ముస్తాబాద్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బాలలపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై మంగళవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల జీవనశైలిపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో 18 ఏళ్లలోపు పిల్లలు స్మార్ట్ ఫోన్లు వినియోగించడం అలవాటుగా మారిందని, దీని వలన వారి మానసిక స్థితి దెబ్బతింటుందని అన్నారు. అనంతరం విజేతలకు ప్రధానోపాధ్యాయులు నాగవేణి బహుమతులు అందజేశారు.



ముసునూరి రోహిత్‌కు ఎంపి అభినందనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మలేషియాలోని కౌలాలంపూర్ లో నవంబర్ 8 నుంచి 16 వరకు జరిగిన కామన్వెల్త్ చెస్ ఛాంపియన్ షిప్ -2025లో కాంస్య పతకం సాధించిన విజయవాడకు చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్ బాబును ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. శాలువాతో సత్కరించారు. గురునానక్ కాలనీలోని ఎంపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఎంపీ కేశినేని శివనాథ్‌ను రోహిత్ లలిత్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రోహిత్ లలిత్ బాబు ప్రతిభ, కృషి యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.



రకికట్టిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి

విజయవాడ : జాతీయ క్రీడాకారిణి విజయశ్రీ పుట్టినరోజు సందర్భంగా గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్ లో పుష్పాంజలి రిథమ్స్ (పాటల పాఠశాల) ఆధ్వర్యంలో ఘనంగా ద్విభాషా సినీ సంగీత విభావరి జరిగింది. ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు బాలాజీ కుమార్ (టీం లీడర్, వ్యాఖ్యాత), బుల్లిబాబు, విఎంసి శ్రీనివాస్, సుధారాణి, సీతాదేవి, ఎన్.చంద్రశేఖర్, జి.విశ్వనాథ్, బోయిన వేణుగోపాల్, రహీమా, లక్ష్మీదుర్గ, సువర్ణలక్ష్మి, సుధారాణి తదితర గాయనీ గాయకులు తెలుగు, హిందీ సినీ పాటలు పాడి కార్యక్రమాన్ని రక్తిగట్టించారు.



భవానీ దీక్షల విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : భవానీ దీక్ష విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి దీక్షా విరమణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. డిసెంబర్ 11 నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమంపై మంగళవారం పోలీస్ కమిషనర్ ఎస్‌వి.రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఆలయ ఈవో వి.కె.శీనానాయక్‌లతో కలిసి సమన్వయ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. భవానీ దీక్షల విరమణకు గత ఏడాది 3.20 లక్షల మంది భవానీ భక్తులు దర్శనానికి తరలిరావడం జరిగిందని.. ఈ ఏడాది ఆరు లక్షల మందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విజయవంతంగా నిర్వహించామని, ఇదే స్ఫూర్తితో భవానీ దీక్షల విరమణను విజయవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా భక్తుల హోల్డింగ్ పాయింట్లు, కేశఖండన ప్రదేశాలు, స్నాన ఘట్టాలు, గిరిప్రదర్శన, క్యూ లైన్లు, ఇరుముడుల సమర్పణ, హోమ గుండం, లడ్డు విక్రయ



కేంద్రాలకు సంబంధించిన సెక్టార్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. భక్తుల రద్దీని దష్టిలో పెట్టుకుని లడ్డు విక్రయ కేంద్రాలు, ఉచిత భోజన సౌకర్యకేంద్రాల సంఖ్య పెంచాలని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. నగరంలో 300లకుపైగా సిసిటివిలను ఏర్పాటు చేస్తున్నామని, ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తూ ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కరాటేలో లక్ష్మీ ప్రసన్నకు బంగారు పతకం



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన మల్లవల్లి లక్ష్మీ ప్రసన్న అండర్ - 18 కరాటే విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. విస్సన్నపేట శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ.. తెలంగాణ రాష్ట్రం మేడ్చల్‌లో ఈ నెల 16న పెంకాక్ సిలాట్ స్పోర్ట్స్ అసోషియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన 'అస్మితా పెంకాక్ సిలాట్ లీగ్'లో పాల్గొని మెడల్ సాధించారు. లక్ష్మీ ప్రసన్న గోల్డ్ మెడల్ సాధించటం పట్ల శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల డైరెక్టర్ యం పూర్ణచంద్రారెడ్డి, అధ్యాపకులు యం వెంకటేశ్వరరావు, హరిబాబు, వేణుబాబు, సిబ్బంది అభినందించారు.

ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సూత్ర ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రముఖ ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సూత్రా వస్త్ర, ఆభరణాల ప్రదర్శనను మంగళవారం అతిధులు చేతుల మీదగా ప్రారంభించారు. అద్వితీయమైన వివాహాది వేడుకలకు అవసరమైన వస్త్రాల ప్రదర్శన ప్రారంభించినట్టు సూత్ర ఎండి ఉమేష్ మాధ్యం తెలిపారు. ఈ ప్రదర్శన కేవలం రెండు రోజుల పాటు నవంబర్ 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రవేశం పూర్తిగా ఉచితమని, ఈ ప్రదర్శనను ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులు సందర్శించవచ్చని తెలిపారు. ఈ ప్రదర్శనలో హస్తకళ, లగ్జరీ, చక్కదనం, అసాధారణ అద్భుతమైన వస్త్రాలు, ఆభరణాలు ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఎన్నో రకాల దుస్తులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శనలో భారతదేశం నలుమూలల నుండి సేకరించి తెచ్చిన వివాహ వేడుకలకు, శీతాకాలానికి అవసరమైన అన్ని రకాల దుస్తులు, వధువుకు కావలసిన అలంకరణ సామగ్రి, డిజైనర్ దుస్తులు, ప్రత్యేక వేడుకలకు ధరించు అద్భుతమైన ఫ్యాషన్ సమకాలీన వస్త్రాలు మొదలైన ఎన్నో రకాల దుస్తులు అన్నీ ఒకేచోట అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. ఈ రెండు రోజుల ఫ్యాషన్ వస్త్ర ప్రదర్శన హస్తకళ, లగ్జరీ, చక్కదనం మిళితమైన ఒక గొప్ప అనుభూతిని కలిగిస్తుందని, ఈ ప్రదర్శనలో లడఖ్ సిల్క్ శారీస్, మోహెూ బొటిక్, కోల్ కతా, చిక్ ఫీట్ ఫుట్ వేర్, సదా ముంబాయి, జ్యువెల్ లక్స్, వర్ణా, జిగ్స్ కలెక్షన్స్ ముంబాయి వంటి పలు సంస్థలు పాల్గొన్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను నగర వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రోడ్డు భద్రతా అవగాహనను పెంపొందించడానికి, హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఆధ్వర్యంలో కార్నివాల్ నిర్వహించారు. ఈ కిడ్స్ కార్నివాల్ కార్యకలాపాల్లో భాగంగా విజయవాడ సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో రేవేంద్రపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల కోసం ఇంటరాక్టివ్ సెషన్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.



ఎన్ఎస్ఇలో పెట్టుబడిదారుల ఖాతాలు రెట్టింపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా మరో మైలురాయిని చేరుకుందని సంస్థ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణ తెలిపారు. నవంబర్ 2025 నాటికి ప్రత్యేకమైన ట్రేడింగ్ ఖాతాల సంఖ్య 24 కోట్లు (240 మిలియన్లు) దాటిందన్నారు. ఇది గత ఏడాది అక్టోబర్‌లో 20 కోట్ల (200 మిలియన్లు) మార్క్‌ను అధిగమించిన తర్వాత కేవలం ఒక సంవత్సరంలో సాధించిన మైలురాయి అని తెలిపారు. ప్రత్యేకంగా రిజిస్టర్డ్ పెట్టుబడిదారుల సంఖ్య 12.2 కోట్లకు (అక్టోబర్ 31,2025 నాటికి) చేరిందని, సెప్టెంబర్ 22 నాటికి 12 కోట్ల (120 మిలియన్లు) ప్రత్యేక రిజిస్టర్డ్ పెట్టుబడిదారుల మైలురాయిని అధిగమించిందని తెలిపారు.

రైల్వే డిఆర్ఎంతో ఎంపి శివనాథ్ భేటీ

- పెండింగ్ రైల్వే పనులపై చర్చ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే డిఆర్ఎం మోహిత్ సోనాకియాను ఎంపి కేశినేని శివనాథ్ కోరారు. డిఆర్ఎంగా మోహిత్ సోనాకియా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ ఆయనకు అభినందనలు తెలిపి కొండపల్లి బొమ్మ బహుకరించారు. మంగళవారం డి.ఆర్.ఎమ్. కార్యాలయానికి విచ్చేసిన ఎంపీ శివనాథ్‌కు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్ బాబు స్వాగతం పలికారు. ఈ భేటీలో ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, కొండపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ విస్తరణ పనులతో పాటు లెవల్ క్రాసింగ్ గేట్ల అంశంపై చర్చించారు. అలాగే వాంబే కాలనీ-మధురానగర్ మధ్య ఎల్.హెచ్.ఎస్. నిర్మాణం త్వరగా చేపట్టాని కోరారు. కె.ఎల్.రావు బ్రిడ్జ (ఎర్ర కట్ట) వద్ద ఆర్‌యుబిలు నిర్మించాలని కోరారు. ఎంపీ అభ్యర్థనలపై డీఆర్ఎం మోహిత్ సోనాకియా సానుకూలంగా స్పందించారు.



గిరిజన ఉత్పత్తులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గిరిజన ఉత్పత్తులకు ఈ-కామర్స్ వేదికలు, వస్తు ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించిన అంతర్జాతీయ సౌకర్యాలు, టోకు- రిటైల్ వాణిజ్య వ్యవస్థలతో సహా వివిధ మార్గాల ద్వారా వాణిజ్య శాఖ నుంచి పూర్తి మద్దతు లభిస్తుందదని సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గిరిజన వ్యాపార సమ్మేళనం-2025లో పలు కీలక అంశాలు ఆమోదించారన్నారు. గిరిజన వ్యవహారాలు, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల సహకారంతో వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పరిశ్రమల అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ఈ సమ్మేళనాన్ని నిర్వహించిందని తెలిపారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తోన్న జనజాతీయ గౌరవ్ వర్ష్ సమయంలో చేపట్టిన ఈ సమ్మేళనం ఒక కీలక ఘట్టంగా నిలిచిపోతుందని తెలిపారు.

21న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-వత్సవాయి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కేశినేని ఫౌండేషన్, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జెఆర్‌సి కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రతినిధులు వి రామ తులసి, సాయి చరణ్ తేజ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్ , పోస్ట్ గ్రాడ్యుయేట్ కలిగి, 35 సంవత్సరాలలోపు వయసు గలవారు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9014943757, 8919951682 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.



'సైబర్ సురక్షా'పై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ : నగరంలోని పలు బ్యాంకుల్లో పోలీసులు మంగళవారం విస్తతంగా సైబర్ సురక్షా కార్యక్రమం నిర్వహించారు. నగరంలో ఉన్న 227 బ్యాంకుల్లో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ అనేదే లేదని, వీడియోకాల్స్ ద్వారా బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930 లేదా సమీప పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ పెట్టుబడుల మోసాలపై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టా వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వచ్చే పెట్టుబడి ప్రకటనలు నమ్మకూడదని, సరైన డీమ్యాట్ అకౌంట్ లేకుండా పెట్టుబడులు పెట్టొద్దని ఖాతాదారులకు అవగాహన కల్పించారు.



"సఖి సురక్ష" ద్వారా ఉచిత వైద్య, కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి-విజయవాడ : స్వయం సహాయక బృందాల మహిళలకు సఖి సురక్ష ద్వారా ఉచిత వైద్య, క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి.వెంకటనారాయణ తెలిపారు. నగర పరిధిలో మంగో మార్కెట్ విఎంసి కల్యాణ మండపం, ఐవి ప్యాలెస్, పటమట హైస్కూల్ రోడ్ వద్ద ఉన్న కనకమేడల రవీంద్ర కుమార్ కళ్యాణ మండపంలో సఖి సురక్ష ఆరోగ్య శిబిరాలను నగరపాలక సంస్థ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ శాఖ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసిడి) పి.వెంకటనారాయణ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వం స్వయం సహాయక బృందాలలో 35 సంవత్సరాలు దాటిన మహిళల కోసం సమగ్ర హెల్త్ క్యాంపులను నిర్వహిస్తూ.. అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15న ప్రారంభించగా, 20, 25 తేదీల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా థైరాయిడ్, హిమోగ్లోబిన్, మూడు రకాల క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నారని అన్నారు. 35 సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక బందం మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్పర్ట్ జి.ఎస్ సుజాత, సి.డి.ఒ లు శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

జపాన్ బృందం డ్రమ్ టావో ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డ్రమ్ టావో లైవ్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు డ్రమ్ టావో ప్రతినిధుల బృందం తెలిపింది. ఈ మేరకు నగరంలోని పీవీపీ మాల్‌లో మంగళవారం సాయంత్రం టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) డ్రమ్ టావో లైవ్ ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. భారత్, జపాన్ మధ్య కళాత్మక బంధం, దీర్ఘకాల సాంస్కృతిక సంబంధాలను వేడుక చేసుకునే లక్ష్యంతో ఇది నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తన శక్తివంతమైన టైకో డ్రమ్మింగ్, కచ్చితమైన సమకాలీకరణ, దృశ్యపరంగా అద్భుతమైన స్టేజ్ ప్రెజెంటేషన్‌కు ప్రసిద్ధి చెందిన ఈ బందం, ఎలక్ట్రిఫైయింగ్ సౌండ్, డైనమిక్ మోషన్‌తో నిండిన సాయంత్రం వేళను ఆస్వాదించేలా 4 వేల మందికి పైగా ఉత్సాహభరితమైన ప్రేక్షకులను ఆకర్షించింది. డ్రమ్ టావో నైపుణ్యం, వేదికపై శక్తివంతమైన ప్రదర్శన అందరి ప్రశంసలను పొందింది. విజయవాడలో విజయవంతమైన కచేరీ తర్వాత, డ్రమ్ టావో నవంబర్ 20న చెన్నైలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో జరగనున్న తదుపరి ప్రదర్శనతో భారత పర్యటనను కొనసాగిస్తుందని వారు తెలిపారు.



రీజనల్ పాస్‌పోర్ట్ అధికారిని కలిసిన ఎంపి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఇటీవల విజయవాడ రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్‌గా నియమితులైన ఎస్.విజయలక్ష్మీకి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపుతూ కొండపల్లి బొమ్మను బహుకరించారు . బందర్ రోడ్డ్ స్టాలిన్ సెంటర్ మాల్ లోని పాస్ పోర్ట్ సేవా కేంద్రం లో ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ తమ కార్యాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ తన సహకారం ఉంటుందని తెలిపారు.